క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అర్జీలు స్వీకరిస్తున్న కౌన్సిలర్ ధనియాల రాధమ్మ

వెంకటగిరి: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిర్దేశించిన సమయంలో అందించేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధమ్మ తెలిపారు. ఆ వార్డు సచివాలయంలో గురువారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిధిలో శానిటేషన్, తాగునీరు, వీధిదీపాలు సమస్యలు వస్తే తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం పలు సమస్యలపై స్థానికులు ఇచ్చిన అర్జీలు స్వీకరించి, సంబంధింత అధికారులకు అందజేశారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని వేములచేడు, అనంతమడుగు సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం వేములచేడు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని కోరారు. ఆయన వెంట ఏఓ శివకుమార్ ఉన్నారు.

మెరుగైన వైద్యమే లక్ష్యం



సిబ్బందిని ప్రశ్నిస్తున్న దయాకర్

సైదాపురం: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యమని జిల్లా ప్రోగ్రామ్ అధికారి పీఎల్ దయాకర్ అన్నారు. సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గిద్దలూరు, సైదాపురం ఆరోగ్యకేంద్రాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రోగులను అప్యాయత, అనురాగాలతో చూసుకోవాలన్నారు. సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని వైద్యుడికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలను తీసుకుంటుందన్నారు. వైద్యులు శ్రీధర్, శ్రావణి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న హరనాథ్‌రెడ్డి, రవీంద్రర్‌రెడ్డి

ఓజిలి: మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డిని కోరారు. మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ద్వారకానాథ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గురువారం కలిశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, నాయకులు పాపాడి రవీంద్రర్ రెడ్డి తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. గ్రామాల్లో నెలకొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అభిప్రాయ సేకరణ వాయిదా

చిల్లకూరు: మోమిడి రిజర్వు ఫారెస్టులో సిలికా తవ్వకాలకు సంబంధించి గురువారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ మళ్లీ వాయిదా పడింది. గిరిజన సంక్షేమ శాఖ, అటవీ శాఖ మండల అధికారులు సంయుక్తంగా గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. అయితే దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన లేని గిరిజనులు కొద్ది మంది మాత్రమే రావడంతో వారు కూడా అక్కడ రిజర్వు ఫారెస్టు తొలగించడంతో తమకు జీవనోధి కరువు అవుతుందని తెలిపారు. తాము దీనిపై తాము ఏమీ చెప్పమని అన్నారు. దీంతో మరోసారి వాయిదా వేశారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రతినిధి కె అంకయ్య, అటవీ అధికారులు గాయం శ్రీనివాసులు, గోపాలకృష్ణ, ఏఓ శ్రీనివాసరావు, సర్పంచ్ ఈదూరు లావణ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అదూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


ఆధార్‌క్యాంప్ ప్రారంభం

వెంకటగిరి: 21వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం ఆ వార్డు కౌన్సిలర్ జి ఢిల్లీబాబు ఆధార్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఆధార్, వేలి ముద్రలు పడని వారు తమ ఆధార్‌లను అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం వార్డు సచివాలయాల్లోనే ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. వలంటీర్లు తమ పరిధిలో ఆధార్ సమస్యలు ఉన్నవారిని గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మినమనముడి..అభివృద్ధి ఒరవడి



మినమనముడి ఎస్సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు



చందనముడిలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

పల్లెసీమలే పట్టుగొమ్మలని భావించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. గ్రామాల ప్రగతికి బాటలు వేసింది. వాటిని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. రూ.కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తోంది. ఫలితంగా పల్లెటూళ్లు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. ఈ కోవలోనే మినమనముడిలో అభివృద్ధి ఒరవడి కొనసాగుతోంది.

దొరవారిసత్రం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దొరవారిసత్రం మండలంలోని మినమనముడి పంచాయతీలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సమకూరాయి. ఇంటింటికీ తాగునీటి కొళాయిలు, సీసీ రోడ్లు, జాతీయ రహదారి నుంచి మినమనముడి గ్రామం మీదుగా ఎస్సీ, ఎస్టీ కాలనీలను కలుపుతూ తారురోడ్డు నిర్మాణం, చెరువుల సప్లయ్ చానళ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టి పూర్తి చేశారు. మినమనముడి, చందనముడి గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రూ.30 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించారు. జలజీవన్ మిషన్ కింద రూ.4 లక్షల వ్యయంతో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లోని చెరువుల్లోకి అటవీ ప్రాంతంలోని వర్షం నీరు సులువుగా చేరేలా రూ.10 లక్షలు వెచ్చించి సప్లయ్ చానళ్లు తవ్వించారు. ఉపాధి హామీ పథకం కింద ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ రూ.10 లక్షలతో నిర్మించారు. మినమనముడి, చందనముడి గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం రెండు జగనన్న లేఅవుట్లను సిద్ధం చేశారు. యర్రచెరువు అభివృద్ధి పనులు చేపట్టారు. చందనముడి గ్రామానికి తాగునీటి కోసం ఎస్ఆర్‌డీడబ్ల్యూపీ పథకం కింద ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మించారు.

రూ.కోట్ల అభివృద్ధి పనులు చేయించాం



మినమనముడి పంచాయతీలో రూ.కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు సాధించాం. ప్రతి ఏడాది వేసవి కాలం వస్తే రెండు గ్రామాల్లోని ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వీధుల సమస్య, రోడ్ల సమస్య తీరింది. చెరువులు, పంటకాలువలు అభివృద్ధి చెందాయి.

- ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

నీటి సమస్య పరిష్కారం



మినమనముడి పంచాయతీలో ప్రజలు కొన్నేళ్లుగా తాగునీటి సమస్యతో సతమతం అవుతూ వచ్చారు. జగనన్న అధికారంలో రావడంతో మూడు చోట్ల బోర్లు తవ్వించి, ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేశాం. దీంతో ప్రతి కుటుంబానికి పుష్కలంగా తాగునీరు అందుతోంది. అలాగే సీసీ రోడ్ల నిర్మాణంతో రహదారుల సమస్య పరిష్కారమైంది.

- బండి అరుణ, సర్పంచ్, మినమనముడి

వలంటీర్ల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం



వలంటీర్‌కు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వాకాడు: భవిష్యత్ తరాల అభివృద్ధికి రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వలంటీర్ల సేవా పురస్కారాల సన్మాన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు సంక్షేమ సారథులని అన్నారు. అనంతరం వలంటీర్లను శాలువతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ గోపీనాథ్, ఏఎంసీ చైర్మన్ నాగభూషణమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, నాయకులు పి కోటేశ్వరరెడ్డి, డి అజిత్‌కుమార్‌రెడ్డి, వి జనార్దన్‌రెడ్డి, బి వెంకటరత్నం పాల్గొన్నారు.

వలంటీర్లే వారధులు

కోట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో వలంటీర్లదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్లను తన రెండు కళ్లుగా భావిస్తారన్నారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రకు ఎంపికైన 267 మంది వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎస్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్‌గౌడ్, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, గురుస్వామి, ప్రసాద్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

పథకాలు.. వైఎస్సార్‌సీపీ గెలుపునకు సోపానాలు



కలువాయి: మాదన్నగారిపల్లెలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు సోపానాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం మాదన్నగారిపల్లె, వెంకటరామరాజుపేట గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్ కుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పామర్తి చెంచమ్మ, సర్పంచ్‌లు దండు నరసింహులు, కండే వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలే జగనన్న లక్ష్యం

రాపూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం బొజ్జనపల్లె ఎస్సీకాలనీ, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల్లో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెంచలకోనను అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్‌తో చర్చించామని, మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ రాంకీ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ నిర్వాహకులు రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వ్యవసాయ సలహ మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, శశిరెడ్డి పాల్గొన్నారు.



రాపూరు: మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నేడు వలంటీర్లకు వందనం

వెంకటగిరి: స్థానిక పద్మశాలియుల కల్యాణ మండపంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 14 సచివాలయాలకు సంబంధించి వలంటీర్లను సన్మానించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

మున్సిపల్ సాధారణ సమావేశం రేపు

వెంకటగిరి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, కౌన్సిలర్లు సమావేశానికి విధిగా హాజరుకావాలన్నారు.

కండలేరులో 31.535 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 31.535 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 110, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు180, హైలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

పెళ్లకూరు: మండలంలోని రైతుల భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ ప్రవీణ తెలిపారు. గురువారం తాళ్వాయిపాడు ఆర్బీకేలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 440 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు పంపిణీ చేసి, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

అడుగడుగునా అపూర్వ ఆదరణ



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనతోనే ప్రజా ప్రతినిధులకు గడప గడపలో హారతులు పడుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం వాటంబేడు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రభుత్వం అందిన పథకాల వివరాలను వివరిస్తూ, బుక్‌లెట్లను అందజేశారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతి, బంధు ప్రీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ జరిగేలా చర్యలు చేపట్టడంతో రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, సర్పంచ్ మహాలక్ష్మి, నాయకులు కే ఆర్ముగం, కే మురుగన్, ఉచ్చూరు మునుస్వామిరెడ్డి, నరేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వరప్రసాద్, రమణయ్య పాల్గొన్నారు.

రీసర్వే సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ చంద్రముని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సిబ్బందితో రీసర్వేపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు తర్వాత భూములను క్షుణ్ణంగా పరిశీలన చేసి, భూములను రీసర్వే చేస్తున్నారన్నారు. రైతులు తమ భూములను రీసర్వే చేయించుకుని, భూమి వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో రీసర్వే పూర్తి అయిన వెంటనే గ్రామసభ ఏర్పాటు చేసి, భూములకు సంబంధించి వివరాలను వెల్లడించాలన్నారు. సర్వేకు సంబంధించి అధికారులను అడిగి వివరాలు సేకరించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, డీటీ పవన్‌కుమార్, సర్వే డీటీ మధుసూదన్‌రాజు, సర్వేయర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలోని కడివేడు రెవెన్యూలో చేపడుతున్న రీ సర్వేను త్వరగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ కోరారు. మండలంలోని కడివేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రీ సర్వేపై గ్రామస్తులు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఓఎస్ మునస్వామి, డీఆర్ హరహర, సర్వేయర్ రామ్‌కుమార్, వీఆర్ఓ బాలాజీ, సర్వేయర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో చెరువు పనులు పూర్తి చేయాలి


చిల్లకూరు: మండలంలోని బూదనం చెరువు కట్ట పునర్నిర్మాణ పనులు నాలుగు నెలల పూర్తి చేయాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ సూచించారు. అర్ధాంతరంగా ఆగిన బూదనం చెరువు కట్ట పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు చెరువులో ఉన్న నీటిని దిగువకు వదిలేందుకు ప్రయత్నించడంతో రైతులు గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను కలసి సమస్యను వివరించారు. దీంతో ఆయన తహసీల్దార్‌ను రైతులకు, కాంట్రాక్టర్లకు మధ్య వివాదం లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ చెరువు ఆయకట్ట కింద సాగు చేసే బూదనం, నెలబల్లిరెట్టపల్లె రైతులు, గ్రామస్తులతో చర్చలు జరిపి ఒక ఒప్పందం చేయించి చెరువులోని నీరును వృథా కాకుండా ఎంత మేర వదులుకోవాలో అంతే వదులుకుని పనులు నాలుగు నెలలో పూర్తి చేసేలా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. దీంతో అటు రైతులు, ఇటు కాంట్రాక్టర్లు సుముఖత వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మస్తానయ్య, సర్వేయర్ రాంకుమార్ నాయకులు మైలాం శ్రీనివాసులరెడ్డి, కట్టా రవీంద్రరెడ్డి, అన్నంరెడ్డి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులు, రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

వైభవంగా గంధోత్సవం

నాయుడుపేటటౌన్: పట్టణంలో ఉన్న హజరత్ ఖాదర్‌షావలీ(చిన్నదర్గా) గంధోత్సవ(ఉరుసు)ం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గడియారం సెంటర్ నుంచి దర్గా వరకు విద్యుత్ దీపాలంకరణల చేశారు. రాత్రి దర్గా సమీపంలో ఉన్న నీలిశెట్టి కుటుంబ సభ్యులు, పఠాన్ అమీర్‌ఖాన్ ఇళ్ల వద్ద నుంచి నిషాన్ జెండాలను ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గా వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం పట్టణంలోని కాలేషా సాహెబ్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగించారు. తెల్లవారుజామున దర్గా వద్ద గంధోత్సవం నిర్వహించారు.



జెండాలతో ఊరేగింపులో నిర్వాహకులు, భక్తులు

దోబీ ఘాట్‌లు ఏర్పాటు చేయాలి

వెంకటగిరి: మున్సిపాలిటీలో ఆధునిక దోబీ ఘాట్‌లను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రజకవృత్తి చేసే వారికి 250 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దిలీప్‌కుమార్, సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ మునిరత్నం, సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

గూడూరు : స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన తిరుపతి సర్వీసులో గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి నుంచి గూడూరుకు ప్రయాణించిన ప్రయాణికులు బస్సులో తమ హ్యాండ్ బ్యాగు మరచిపోయారు. అందులో రూ.51,500 నగదు, ఏటీఎం కార్డు, పొదుపు పుస్తకాలు ఉన్నాయి. బస్సు కండక్టర్ పి.మస్తానయ్య ఆ బ్యాగును గుర్తించి, గూడూరు డిపోలో అందజేశారు. అనంతరం డీఎం ద్వారా సెక్యూరిటీ సమక్షంలో ప్రయాణికులకు అందజేశారు. కండక్టర్ నిజాయితీని ప్రయాణికులు, డీఎం, డిపో సిబ్బంది తదితరులు ప్రశంసించారు.

విజిలెన్స్ దాడులు

సైదాపురం: తురిమెర్ల- పెరుమాళ్లపాడు సమీపంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. మైనింగ్ విజిలెన్స్ ఏజీ నాయక్ పర్యవేక్షణలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాలం ముగిసినా మైనింగ్ తవ్వకాలు అక్రమంగా చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎంత మేరకు తవ్వకాలు చేపట్టారన్న విషయంపై విచారణ చేపట్టారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ అధికారులకు సమగ్ర నివేదిక పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

వేడుకగా కోటమ్మ గ్రామోత్సవం

కోట: మండలంలోని వెంకన్నపాళెం గ్రామదేవత కోటమ్మ గ్రామోత్సవం గురువారం వేడుకగా నిర్వహించారు. కోటమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండోరోజున అమ్మవారికి సముద్ర జలాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూలబుట్టలతో అమ్మవారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో భక్తులు

వలంటీర్లకు సన్మానం



వలంటీర్లను సన్మానిస్తున్న నేతలు

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో తాళ్వాయిపాడు, కానూరు, బంగారంపేట సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, కార్యదర్శులు శ్రీహరి, యాస్మిన్ వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్, జితేంద్ర, సునీల్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గూడూరు: పట్టణంలోని ముత్యాలపేటలో సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గురువారం రాత్రి స్థానికులు గుర్తించి, ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడు బ్లూ జీన్స్ ప్యాంటు, తెల్లరంగు కట్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.